అనుసంధానం ఎప్పుడో?

- నగరంలో కాల్వల నిర్వహణ అస్తవ్యస్తం
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- కలెక్టర్ ఆదేశాలు అమలయ్యేనా

మచిలీపట్నంటౌన్: బందరులో డ్రెయిన్ల అనుసంధానం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక్కడ డ్రెయిన్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నగరం సముద్రం కంటే పల్లంగా ఉండటంతో మురుగు నీటి పారుదల శాపంగా మారింది. ఓగ్ని తుఫాన్ సమయంలో నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నగర పర్యటనలో ఉండి ముంపు పరిస్థితులను గమనించారు. దీనికి స్పందించిన ఆయన నగర మంతా పక్కా డ్రెయిన్ల నిర్మాణానికి దాదాపు రూ. 140 కోట్లు మంజూరు చేశారు. వీటితో నాడు పలు ప్రాంతాల్లో చిన్నా, పెద్దా పక్కా డ్రెయిన్లను నిర్మించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు మారడంతో ఈ పనులకు గ్రహణం ఏర్పడింది. దీంతో అనుసంధానం పనులు అసంపూర్తిగానే మిగిలాయి. దీంతో వర్షాలు పడినపుడు మురుగు పారుదలకు ఇబ్బంది ఎదురవుతోంది. డ్రెయిన్ల అనుసంధానం లేక ముంపు నీరు రోడ్లపైకి చేరి జలమయమవుతున్నాయి. సాధారణ రోజుల్లో సైతం మురుగునీరు నిలుస్తుండటంతో నగర వాసులు ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ

పక్కా డ్రెయిన్లు ఉన్నా వాటికి పలు శివారు ప్రాంతాలతో పాటు కల్వర్టులు ఉన్న చోట అనుసంధానం జరగలేదు. ఫలితంగా మురుగునీటి పారుదలకు ఇబ్బంది ఏర్పడుతోంది. అనుసంధానం జరగక ఆ ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్లుగా మారడంతో సిల్ట్ సమస్య అధికంగా ఉంటోంది. సిల్ట్ తొలగింపు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో దీని ప్రభావం మురుగు పారుదలపై పడుతోంది. ఈ ప్రాంతాల్లో డ్రెయిన్ల అనుసంధానం జరిగితే ఎంతో కొంత సమస్యకు పరిష్కారం లభించేది.


మచిలీపట్నం భాస్కరపురం సెంటర్‌లోని డ్రెయిన్ లో పేరుకున్న సిల్ట్

డ్రెయిన్లే లేని దుస్థితి

నగరంలోని చాలా ప్రాంతాల్లో కచ్చా, పక్కా డ్రెయిన్లే లేవు. నగర శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉందంటే నమ్మొచ్చు.. కానీ నగర నడిబొడ్డున అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో సైతం ప్రధానరోడ్డుకు ఓ పక్కనే డ్రెయిన్ ఉండి మరో వైపు లేకపోవడం గమనార్హం. జిల్లా కోర్టు సెంటర్ నుంచి నాయర్ బడ్డీ సెంటర్ మీదుగా భాస్కరపురం వరకూ ఎస్పీ బంగ్లా వైపు అసలు డ్రెయినే లేదు. భాస్కరపురంలో కెనడీ రోడ్డు వెంట ఓ పక్క డ్రెయిన్‌లేదు. బుట్టాయిపేట సెంటర్ నుంచి ఐదురోడ్ల సెంటర్ వరకూ కూడా ఓ పక్క డ్రెయిన్‌లేదు. దీంతో కాలువ లేని ప్రాంత వాసులు వ్యర్థ జలాలను రోడ్లపైకి వదిలేస్తున్నారు. కొంత మంది రోడ్లపైగా పైప్‌లు ఏర్పాటు చేసుకుని అటువైపు ఉన్న డ్రెయిన్‌లోకి మురుగునీటిని పంపే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో రద్దీగా ఉండే రోడ్లపై ఈ పైపులు పెద్ద స్పీడ్‌బ్రేకర్లుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు మంజూరుపై..

కలెక్టర్ డీకే బాలాజీ కొద్ది రోజులుగా నగరంలోని పలు డివిజన్లలో విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన డ్రెయిన్‌ల అనుసంధానం జరక్కపోవడాన్ని గమనించారు. వీటితో ఎదురవుతున్న సమస్యను పసికట్టిన ఆయన డ్రెయిన్ల అనుసంధానం పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అయితే ఈ పనులకు నిధులు ఎలా సమకూరుస్తారనేది ప్రశ్నగా మారింది. మరి ఈ పనులకు నిధుల మంజూరు ఎప్పటికి జరిగేనో.. ఎప్పటికి పూర్తయ్యేనో అధికారులకే తెలియాలి.


నగర శివారు రాడార్ కేంద్రం సమీపాన అనుసంధానం లేని పక్కా డ్రెయిన్


జిల్లా కోర్టుకు వెళ్లే రోడ్డులో అసంపూర్తిగా కాల్వ


శక్తిగుడి సమీపాన అనుసంధానం లేని ఈడేపల్లి డ్రెయిన్

క్లుప్తంగా

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం



మచిలీపట్నంటౌన్: ముత్తూట్ ఫైనాన్స్, కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. మల్కాపట్నంలోని క్షయ, హెచ్ఐవీ నివారణ సంస్థ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణాధికారి ఎ.వెంకట్రావ్ వీటిని బాధితులకు ఆయా సంస్థల ప్రతినిధులతో కలసి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది కొండపల్లి వేణుగోపాలరావు, తూము మధుసూదనరావు, నాగేశ్వరరావు, చప్పిడి విజయ్‌కుమార్, రాగోలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవ పనులకు పూజలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవ పనులకు ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు శుక్రవారం ఉదయం పూజలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 4వ తేదీ మంగళవారం జరిగే రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలిపారు. అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా జనవరి పండుగ

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): పంచాయతీ శివారు ఎన్టీఆర్ కాలనీ బాప్టిస్ట్ దేవాలయం క్రైస్తవ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం వార్షిక జనవరి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో దైవజనురాలు కొక్కిలిగడ్డ షకీలా నేతృత్వంలో ప్రార్థనలు చేసి క్రీస్తు సందేశాలు వినిపించారు. అనంతరం నూతన సంవత్సరం ముగింపు వేడుకలో భాగంగా గ్రామస్తులు సమష్టిగా జెండా ప్రతిష్ఠ చేశారు. రెండు వేలమందికి అన్న సంతర్పణ చేశారు. సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్, కమిటీ పెద్దలు ఆరుంబాక నిరీక్షణరావు, కనగాల సుబ్బారావు, బందెల ఏసు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): తెలుగురావుపాలెంలోని ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం సందర్భంగా జనవరి పండుగను ఆది ఆంధ్ర ఫీల్డ్ సంఘ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యాన శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫాదర్ జాకబ్ ప్రసాద్, మండలి వెంకట్రామ్ ఇతర నేతలు పాల్గొన్నారు.

భల్లూకమా..భళా



కృత్తివెన్ను: గుంపులు గుంపులుగా కోతులు.. కొబ్బరికాయలను పిందెలతో సహా ఇష్టానుసారం లాగిపడేస్తున్నాయి. ఇవే కాకుండా పిందె దశలో ఉన్న మినుము పంటపై పడి మొక్కలను పీకేస్తున్నాయి. ఇటువంటి సమయంలో దిక్కుతోచని రైతులకు చక్కని ఉపాయం తట్టింది. కృత్తివెన్ను మండలం మునిపెడకు చెందిన రైతులు ఎలుగుబంటి ఆకారం కలిగిన వేషాన్ని తీసుకువచ్చారు. ఒక వ్యక్తికి ఆవేషం ధరింపచేసి కోతుల గుంపులవైపు తీసుకెళ్లారు. ఆ కృత్రిమ ఎలుగుబంటిని చూసిన కోతులు నిజమైన పెద్ద జంతువేదో తమ వైపు వస్తుందన్న భయంతో పారిపోతున్నాయి.

స్కాలర్‌షిప్‌నకు రూ. 3 లక్షలు డిపాజిట్ చేసిన పూర్వ విద్యార్థి

బంటుమిల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థితిలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేసేందుకు రూ. 3 లక్షల డిపాజిట్‌ను అందచేశారు. పాఠశాలలో విద్యనభ్యసించి కార్పొరేట్ రంగంలో స్థిరపడ్డ మారుతి కృష్ణ ప్రసాదు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బంటుమిల్లి ఎస్‌బీఐలో డిపాజిట్ చేసిన రూ. 3 లక్షల పత్రాన్ని శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం బీ. వీరవెంకట్రావుకు అందచేశారు. దీనిపై వచ్చే వడ్డీ రూ.24 వేలతో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించాలని హెచ్‌ఎంను కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి

ఘంటసాల: ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగేలా ఓటర్లు సహకరించాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లోని 166, 166ఏ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ విజయప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చైతన్య లక్ష్మి, హెచ్ఎం శ్రీరంగవల్లి, ఈశ్వరరావు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 1వ తేదీ శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బలరామునిపేట, నిజాంపేట, శక్తిగుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

బంటుమిల్లి: అర్తమూరు గ్రామానికి చెంది రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాల సభ్యులను శుక్రవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు పరామర్శించారు. ఈ నెల 30వ తేదీ రాత్రి 216 జాతీయ రహదారిపై పెడన బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన బాపట్ల విజయ్, పాలపర్తి శాంతారాజ్, పీతల అజయ్ మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి తాత్కాలిక సాయంగా రూ. 30వేలు చొప్పున అందచేశారు. అనంతరం కలెక్టర్ బాలాజీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వీరబాబు, మల్లేశ్వరం డీసీ చైర్మన్ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలను జయప్రదం చేయండి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి ఉత్సవాలను అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో గత సమస్యలు ఉత్పన్నం కారాదని స్పష్టం చేశారు. పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో సమన్వయ కమిటీ సమావేశం ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ 26వ తేదీ మహాశివరాత్రి, రథోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణానది మూడు ఘాట్‌ల వద్ద భారీ బందోబస్తుతో పాటు స్వామివారి దర్శనానికి వచ్చే వీఐపీలు, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శిబిరాలు, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు, పోలీస్, దేవస్థానం, ఘాట్స్, పార్కింగ్‌తో పాటు ట్రాఫిక్‌పై సూచనలు చేశారు. చల్లపల్లి, రావివారిపాలెం రోడ్డు మరమ్మతులకు కనీసం రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేయించాలని పంచాయతీ తరఫున అరజా కిరణ్‌కాంత్ కోరారు. మరోసారి సమన్వయ కమిటీ సమావేశం జరుగుతోందని, ఆ సమావేశంలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ కృష్ణానది ఒడ్డున ఘాట్లను పరిశీలించారు. ఆర్డీవో, డీఎస్పీ శ్రీ దుర్గా నాగేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణ భారతి, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

రక్తదాన శిబిరం



మచిలీపట్నం టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని వాసవీ భవన్‌లో జిల్లా ఆర్య వైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, బందరు మండల ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మోటమర్రి బాబాప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 15 మంది ఆర్యవైశ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి వెంకటప్రగడ వీరాంజనేయులు, ఆర్య వైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, కార్పొరేటర్ అన్నం ఆనంద్, వేముల శ్రీనివాస్, మామిడి దుష్యంత్ కుమార్, మాడిశెట్టి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వైద్యుడు హనుమంతయ్య, సిబ్బంది రక్తాన్ని సేకరించారు.

శ్రీనివాసరావు సేవలు ఆదర్శప్రాయం

కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): సమాచార పౌరసంబంధాలశాఖలో డివిజనల్ పబ్లిక్ రిలేషన్ అధికారిగా పనిచేసిన సుంకర శ్రీనివాసరావు సేవలు ఆదర్శప్రాయమని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో సమాచారశాఖ అధికారుల పాత్ర కీలకమన్నారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి వాటి ఫలాలు ప్రజలకు చేరవేయటంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటిశాఖలో 38 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో అత్యుత్తమ సేవలు అందించి ఉన్నతాధికారుల మన్ననలు శ్రీనివాసరావు పొందారన్నారు. అవకాశముంటే భవిష్యత్తులో శ్రీనివాసరావు సేవలు వినియోగించుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో శ్రీనివాసరావుకు సమాచారశాఖ సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించి అభినందనలు తెలిపారు. సభలో డెప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే మోహనరావు, డివిజనల్ పీఆర్వోలు జి. రాజేష్, కె.రవి, పబ్లిసిటీ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

ఘనంగా కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

నాగాయలంక: శ్రీకన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయ కమిటీ, మండల ఆర్య వైశ్యసంఘం, వాసవీ సేవాదళ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో తొలుత అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్(రాజా)-సాయిప్రియ దంపతులు అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తి సమేతంగా 108 బిందెలతో కృష్ణానదికి తరలి వెళ్లిన ఆర్యవైశ్య మహిళలు, ప్రముఖులు జలాలతో ఆలయానికి చేరుకున్నారు. వీటితో అభిషేకించి, 108 కేజీల కొత్త బియ్యంతో భక్తులు స్వయంగా అభిషేకించారు. అభిషేకించిన కొత్త బియ్యంతో 500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. మండల సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా వీర అన్నపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెడన: కన్యకాపరమేశ్వరి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్, వాసవి క్లబ్, శ్రీవాసవి మహిళా మండలి తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత హోమం చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు డాక్టర్ కొల్లూరి చిన్నా, తమ్మన సుబ్బారావు, ఇమ్మడి నాగపోతరరావు, రాధాకృష్ణ గుప్తా పాల్గొన్నారు.

మోపిదేవి: మోపిదేవి రామకృష్ణ గ్రౌండ్‌లో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విస్సంశెట్టి మొగలేశ్వర గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తారకరామారావు, రాజ్యలక్ష్మి, రమేష్, చిన రాజాబాబు, పెద రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానది పవిత్ర జలాలతో అభిషేకం


పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మయ్య మృతి

ఘంటసాల: కొడాలి - వేములపల్లి గ్రామాల మధ్య గుండేరు డ్రెయిన్ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన చౌటూరి లక్ష్మయ్య (22) మృతి చెందాడు. గోగినేనిపాలెం గ్రామానికి చెందిన లక్ష్మయ్య గురువారం రాత్రి మొవ్వ నుంచి చల్లపల్లి వైపు ద్విచక్ర వాహనం పై వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ధాన్యం లోడు ట్రాక్టర్ ఢీ కొనడంతో లక్ష్మయ్య పడిపోగా ట్రాక్టర్ అతని పై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని మచిలీపట్నం ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు విజయవాడ తీసుకెళ్లాలని సూచించారు. అతను మార్గమధ్యంలో మరణించాడు. మృతుడు లక్ష్మయ్య భార్య దండెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వేమూరి వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం చేయడానికి అధికారులు సహకరించాలని యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు విజ్ఞప్తి చేశారు.



రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



గూడూరు: తుమ్మలపాలెంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.7 లక్షలతో గ్రామంలో రెండు అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. సర్పంచి కోడే రేణుకాదేవి, చిన వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



పెదప్రోలు(మోపిదేవి): ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టిన పశు వైద్య శిబిరాలు పూర్తైనట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ తెలిపారు. పెదప్రోలులో చివరిరోజు శుక్రవారం చేపట్టిన పశువైద్య శిబిరంలో 39 పశువులకు, 260 గొర్రెలు, మేకలు, 25 దూడలకు నట్టల నివారణ మందు అందించినట్లు తెలిపారు. మండలంలో 13 పంచాయతీల్లోనూ 13 క్యాంపులు నిర్వహించి గర్భకోశ వ్యాధి నివారణ పశువులు 383, దూడలకు నట్టల నివారణ మందులు 800, గొర్రెలు, మేకల నట్టల నివారణ మందు ఇచ్చింది. 4,235, గొర్రెలకు మసూచి(పాక్స్) టీకాలు వేశారు. 3,620 లబ్ధి పొందిన రైతులు 532 మంది ఉన్నారని వివరించారు.

మద్యం సేవించి డ్రైవ్ చేయడంతో ప్రమాదం

పెడన: పెడన బైపాస్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంఘటనలో లారీ డ్రైవర్ పూటుగా మద్యం సేవించి డ్రైవ్ చేయడంతో ప్రమాదం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. గురువారం రాత్రి పెడన బంటుమిల్లి బైపాస్ రోడ్డులో జరిగిన ఘటనపై 'సాక్షి'లో ఈ నెల 31న 'రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం' అంటూ వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. లారీ డ్రైవర్ పవన్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పవన్ మద్యం సేవించి ఉండటంతో పోలీసులు అతన్ని గురువారం రాత్రికి రాత్రే మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించి నివేదికలు సిద్ధం చేసినట్లుగా సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో పూర్తి సమాచారం తెలియజేసి అరెస్ట్ చూపిస్తారని తెలుస్తోంది.

సబ్‌జోన్ పోటీలు ప్రారంభం



కోడూరు: అవనిగడ్డ సబ్‌జోన్ స్థాయి 84వ గ్రిగ్ మెమోరియల్ బాలికల ఆటల పోటీలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. లింగారెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా పోటీలకు శ్రీకారం చుట్టారు. పోటీల్లో అవనిగడ్డ, చల్లపల్లి, నాగాయలంక, ఘంటసాల, కోడూరు, మోపిదేవి మండలాల నుంచి 22 పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ఎంఈఓలు టి.వి.ఎం. రామదాసు, శ్రీనివాసరావు, ఎస్ఐ చాణిక్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలను హెచ్‌ఎం నాగరత్నకుమారి, విద్యాకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గూడూరు: పెడన నియోజకవర్గ స్థాయి బాలికల సబ్‌జోన్ పోటీలు శుక్రవారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హోరాహోరీగా సాగాయి. బాలికలు ఆటల్లో సత్తా చాటారు.

దేవాంగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

గూడూరు: దేవాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దేవాంగ సంక్షేమ సంఘం పనిచేస్తుందని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రహ్మణ్యంలు పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న విజయవాడలో జరగనున్న దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లలో భాగంగా సంఘ నాయకులు మల్లవోలులో పర్యటించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శివశంకరయ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాద్, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఏరాజు అరుణబాబు తదితరులు పాల్గొన్నారు.